కొత్త ఓటర్ల నమోదును ప్రోత్సహించాలి

- ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకోవాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగిస్తూ ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సాధారణ ఎన్నికలు 2023 అనంతరం ఈసీఐ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ని కల షెడ్యూల్ విడుదల, ఎన్నికల సరళి, స్క్రూటినీ, ఓటింగ్, ఫలితాల సరళి వివరాలను ఈసీఐకి కలెక్టర్ రాజర్షిషా తెలియజేశారు. అనంతరం మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ.. ఫాం 6 ద్వారా నమోదు చేసుకున్న వారి ఓటును బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు ఆన్‌లైన్‌లో వేగవంతం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆబ్సెంట్ ఓటర్లు, చిరునామా మార్పు చేసుకునే ఓటర్లు, డెత్ ఓటర్ల వివరాలు (ASD) నమోదు చేయాలని సూచించారు. డబుల్ ఓటర్ల నమోదులు తీసివేయాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1 జనవరి, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు నూతన ఓటరుగా ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 6 జనవరి, 2024న ముసాయిదా జాబితా ప్రకటన, 8 ఫిబ్రవరి 2024న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

త్వరలో స్థానిక సంస్థలకు జరగబోయే ఎన్నికల దృష్ట్యా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీ తాలక్ష్మారెడ్డిని గురువారం మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, నాయకులు శేఖాగౌడ్ కలిశారు. ఎమ్మెల్యేను సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. -వెల్దుర్తి, డిసెంబర్ 7

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని నార్సింగి మండల ప్రజాప్రతినిధులు,నాయకులు గురువారం రామాయిపల్లి గెస్ట్‌హౌస్‌లో కలిసి శుభాకంక్షలు తెలిపారు. కలిసిన వారిలో నార్సింగి జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు మైలరాం బాబు, నేతలు ఉన్నారు. -చేగుంట, డిసెంబర్ 7

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శివ్వంపేట, డిసెంబర్ 7 : మండలకేంద్రమైన శివ్వంపేటకు చెందిన మ్యాస బాలమణి ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పులిమామిడి స్రవంతి నవీన్‌గుప్తా కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఎలకంటి బాలీర్ ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వారాల గణేశ్, కొడకంచి రవీందర్ గౌడ్,బాసంపల్లి ప్రభులింగం, ఈసారపు శ్రీనివాస్ గౌడ్, బిచ్కుంద అంజయ్య, దేవనబోయిన కృష్ణ, ఒర్రె మల్లేశ్, బిజిలిపురం సత్తయ్య, కమలయ్యగారి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తులు

రామాయంపేటలో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ గోపాల్

రాయాయంపేట, డిసెంబర్ 7 : రామాయంపేటలో టెన్త్, ఇంటర్ చేయనివారు ఓపెన్ స్కూల్‌కు తమ దరఖాస్తులను అందజేయాలని రామాయంపేట ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ గోపాల్, ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగమణి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడారు. రామాయంపేట ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో తమ దరఖాస్తులను నేరుగా 11వ తేదీ వరకు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9908 5710 19లను సంప్రదించాలన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా విద్యా శాఖ అధికారి రాధాకిషన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాపన్నపేట, డిసెంబర్ 7 : ఉపాధ్యాయులందరూ ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పటిష్ట పరిచి విద్యాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ సూచించారు. ఈ మేరకు గురువారం పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అటెండెన్స్ వందశాతం అమలయ్యేలా ప్రతి ఉపాధ్యాయుడు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా డీఈవో రాధాకిషన్‌ను కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు సురేందర్ గౌడ్,మండల నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, మండల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మహేశ్వర్, శ్రీనివాస రావు, మాధవరెడ్డి, రాజు, చెన్నంమొల్ల కిషన్‌తో పాటు మండల పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మేస్తున్న ముసురు

- ఆందోళనలో అన్నదాతలు

వరికుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

రామాయాంపేట. డిసెంబర్ 7 : మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో పొగమంచు ముంచుకొస్తుంది. రైతులు సైతం నోటికాడికి వచ్చిన వరిగింజలు ఎక్కడ తడిసిపోతాయోననే ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రామాయంపేట పట్టణంలోపాటు మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రోడ్లపై ఆరబోసిన వరిగింజలు ముసుర్లకు తడిసి పోతుండడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. వరి గింజలు ఎక్కడ చేతికి రాకుండా పోతాయోననే ఆందోళనతో టార్పాలిన్లను కప్పుతున్నారు. మరో వైపు సంచుల్లో వరిగింజలను నింపి నిర్జన ప్రదేశంలో పెడుతున్నారు. ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ముసుర్ల వల్ల పంట చేతికి రాకుంటే మా కుటుంబాలను ప్రభుత్వ మే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

రామాయంపేట అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న మహాపడిపూజ

రామాయంపేట, డిసెంబర్ 7 : రామాయంపేట పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మహాపడి పూజ ఘనంగా జరిగింది. గురువారం పడిపూజలో భాగంగా రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వాములంతా అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పడి పూజలో భాగంగా స్వామివారికి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అయ్యప్ప స్వామికి పూలతో అలంకరించి వేద బ్రాహ్మణులతో పూజా కార్యక్రమాలను చేపట్టారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటేలో అబ్దుల్లాకు రజతం

రజత పతకం సాధించిన అబ్దుల్లా, మాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 7 : ఈనెల 6, 7 తేదీల్లో నల్లగొండలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన అబ్దుల్లా వెండి పతకం సాధించినట్లు గురువారం రెంజుకి షోటోకాన్ వ్యవస్థాక అధ్యక్షుడు నగేశ్ తెలిపారు. ఈ పోటీలకు హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 400లకు పైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అబ్దుల్లా అండర్-17 విభాగంలో రజత పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్లాను కరాటే మాస్టర్లు దివాకర్, విద్యాసాగర్ అభినందించారు.

రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

చేగుంట, డిసెంబర్ 7 : రాష్ట్రస్థాయి అండర్ 14 రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది బాల బాలికలు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన ఆర్గనైజింగ్ సెక్రటరీలు రమేశ్, రామేశ్వర్‌రెడ్డి, అమూల్యమ్మ, కోచ్ కరణం గణేశ్, రవి కుమార్ తెలిపారు. చేగుంటలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈనెల 10,11,12 తేదీల్లో మేడ్చల్ జిల్లాలోని కండ్లకోయలోని సన్‌ప్లవర్ దేదిక స్కూల్ లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. పీడీలు శారద, వెంకటేశ్, పీఈటీలు బాల్‌రాజ్, ఆశీర్వాదం, చంటి, ప్రీతి, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ రెఫరీ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశం ఇంట్లో విషాదం..

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

చేగుంట, డిసెంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన విషాద సంఘటన చేగుంట మండలం మక్కరాజిపేటలో గురువారం చోటు చేసుకుంది. చేగుంట పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కరాజిపేట గ్రామానికి చెందిన ఎర్ర గొల్ల రమేశ్, రజిత ఇటీవల గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. గురువారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో గృహప్రవేశ వేడుకలు నిర్వహించారు. ఇంట్లోకి వస్తువులను తీసుకురావడానికి ఆరో తరగతి చదువుతున్న కుమారుడు ఎర్ర గొల్ల నగేశ్ (11) సైకిల్‌పై వస్తుండగా, గజ్వేల్ నుంచి చేగుంటవైపు వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నగేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కంటైనర్ డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నదని, సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కంటైనర్ డ్రైవర్‌ను చితికబాదారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై రాస్తారోక్ చేయడంతో సుమారు రెండుగంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, చేగుంట ఎస్సై హరీశ్ గౌడ్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించామని పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

శివ్వంపేట, డిసెంబర్ 7 : చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మండలం షాపూర్‌నగర్‌కు చెందిన పోసారుగార్ల శ్రీనివాస్‌రెడ్డి (37) మద్యానికి బానిసై ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం నవాబ్‌పేటలోని సాంబయ్యచెరువులో శ్రీనివాస్‌రెడ్డి శవమై తేలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు తెలుసుకొని బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. మృతుడి భార్య మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.